సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 114 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | మంగళవారం | 26.08.2025



## రైల్వే జీఎంను కలిసిన 'చామల'

- పలు రైల్వే సమస్యలపై చర్చ

2 లో



## గ్రామాల్లో పనుల పండుగ

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- రఘునాథపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాన

3 లో





# మట్టి గణపతినే పూజిద్దాం..

- పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :**

వినాయక చవితి పండుగ రోజున పూజకు మట్టి ప్రతిమలను వినియోగించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో అదనపు కలెక్టర్ బెన్షా లోమ్, అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌తో కలిసి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్న ప్రచార పోస్టర్ ను ఆవిష్కరించారు. వినాయక చవితి పండుగ పురస్కరించుకుని పూజ ఉపయోగించే మట్టి వినాయక ప్రతిమలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి పండుగకు మట్టి వినాయక ప్రతిమలనే వినియోగించి జల కాలుష్య నివారణకు సహకరించాలన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సునీత ఆధ్వర్యంలో సరఫరా చేసిన రెండు వేల మట్టి వినాయక విగ్రహాలను జిల్లా బీసీ సంక్షేమ శాఖ సహకారంతో పంపిణీ చేస్తున్నామన్నారు. పాలకుర్తిలో 300 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశామని, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 500, కలెక్టర్ కార్యాలయం, జనగామ మున్సిపాలిటీ ద్వారా మిగతా ప్రతిమలను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రంగుల వినాయక ప్రతిమలను నిమజ్జనం రోజున నీటిలో వేయడం ద్వారా నీటిలోని క్రిమి కీటకాలు చనిపోయే ప్రమాదం ఉన్నందున మట్టి ప్రతిమలను వినియోగించి జల కాలుష్య నివారణలో భాగస్వాములు కావాలన్నారు. అంతేగాక గణేష్ నవరాత్రుల ఉత్సవాలలో మండపాల వద్ద విద్యుత్ వైర్లకు దూరంగా ఉండాలని, ఎటువంటి ప్రమాదాలు వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ ప్రొఫెసర్ మానస, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రవీందర్, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

నాయక చవితి సందర్భంగా ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు నిర్వహించే ఉత్సవాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టేందుకు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమన్వయ సమావేశంలో అదనపు కలెక్టర్లు బెన్షా లోమ్, పింకేష్ కుమార్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి ఉత్సవాల నిర్వహణపై కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో వినాయక చవితి, నిమజ్జనం వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు ముందుగా ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి విధులను కేటాయించాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను సక్సెస్ చేయాలన్నారు. సమన్వయ సమావేశంలో ఆర్డీవోలు గోపి రాం, డిఎస్ వెంకన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.



wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way



## రైల్వే జీఎంను కలిసిన ఎంపీ చామల

**సికింద్రాబాద్, మన చౌరాస్తా :** సికింద్రాబాద్ లోని రైల్ నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను భువనగిరి ఎంపీ చామల్ కిరణ్ కుమార్ రెడ్డి సోమవారం కలిసారు. ఘట్కేసర్ నుంచి యాదాద్రి భువనగిరి ఎంఎంటీఎస్ రైలు భూ సేకరణ కోసం యాదాద్రి కలెక్టర్, మేడ్చల్ కలెక్టర్లతో ఫోన్ లో మాట్లాడారు. భువనగిరి నుంచి యాదాద్రి (రాయిగిరి) పనులు మొదలయ్యాయని, వీటిని త్వరితగతిన పనులు పూర్తి చేస్తే యాదాద్రికీ వచ్చే భక్తులు, అప్ అండ్ డౌన్ కార్మికుల కష్టాలు తీరుతాయన్నారు. రామన్నపేటలో ఫలక్‌నామా, శబరి, నారాయణాద్రి ఎక్స్ప్రెస్ లో హాల్టింగ్ గురించి చర్చించారు. దినికి రైల్వే మేనేజర్ సనుకూలంగా స్పందించారు. వీరితో పాటు సౌత్ సెంట్రల్ రైల్వే అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఉదయనాథ్ కోట్ల, ఎంఎంటీఎస్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ సాయిప్రసాద్ ఉన్నారు.





# ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం..

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా :** ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బెన్షా లోమ్, (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ తో కలసి కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రజల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అందులో కొన్ని ఈ విధంగా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నమిలికొండ గ్రామానికి చెందిన పులి వనమ్మ తన భర్త యాకయ్య చనిపోయారని వితంతు పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందించింది. చిల్పూర్ మండలం ఫత్తేపురం గ్రామానికి చెందిన భీమ గోని రాజయ్య దరఖాస్తు అందిస్తూ తాను ఆటో డ్రైవర్ గా జీవనం కొనసాగిస్తున్నానని తన భార్య అకస్మాత్తుగా పాము కరిచి చనిపోయిందని కుమారుడు వెంకటేష్ ను చూసుకునేందుకు ఇంటి దగ్గర ఎవరూ లేరని, 8వ తరగతి వరకు చదువుకొని ఉన్నందున 9వ తరగతిలో సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాల్సిందిగా కోరారు. జనగామ మున్సిపల్ పరిధిలోని బీరప్ప గడ్డ 23వ వార్డు కు చెందిన మెరుగు స్రవంతి తన దరఖాస్తు అందిస్తూ తనకు ఇంటి స్థలం ఉందని ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నర్మెట్ట మండల కేంద్రంలోని ప్రైమరీ స్కూల్ లో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు ఫ్లడ్ డ్రైనేజీ స్కీం కింద మార్చి 2025 లో చేపట్టి పూర్తి చేశామని నిధులు మంజూరు చేయాలని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పి రాధిక దరఖాస్తు అందించారు. ఈ సందర్భంగా దరఖాస్తులను సంబంధిత అధికారులకు పంపి సమగ్రంగా పరిశీలించి పరిష్కరించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవోలు గోపి రామ్, డిఎస్ వెంకన్న, డిప్యూటీ కలెక్టర్ కొమరయ్య, కలెక్టరేట్ ఏ.వో శ్రీకాంత్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## జిల్లా ప్రగతిలో రోహిత్ సింగ్ పాత్ర ఎనలేనిది

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ కృషి మరువలేనిదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా ప్రశంసించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశపు హల్ లో బదిలీపై వెళుతున్న రోహిత్ సింగ్ కు ఆత్మీయ వీడ్కోలు, అదే విధంగా నూతనంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా నియమితులైన బెన్షా లోమ్ కు అభినందన సభలను టీఎన్జీవో ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అదనపు కలెక్టర్ గా పనిచేసి హైదరాబాద్ లోని సివిల్ సప్లైస్ శాఖకు బదిలీపై వెళ్తున్నందున రోహిత్ సింగ్ సేవలను కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. జిల్లాలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో రోహిత్ సింగ్ పాత్ర కీ రోల్ గా ప్రశంసించారు. ఉద్యోగులను ఒక్కతాటిపై నడిపించడంలో ఊహించిన దానికంటే ఎక్కువ సేవలు తీసుకోవడం జరిగిందని, సివిల్ సప్లైస్ శాఖను చాలంజ్ గా తీసుకొని రైతులకు, ప్రజలకు మరింత దగ్గరయ్యారన్నారు. అదే విధమైన పాలన బెన్షా లోమ్ అందించాలని ఆకాంక్షించారు. రైస్ మిల్లర్లు పాల్గొని అభివందనలు తెలుపుతూ... రోహిత్ సింగ్ బదిలీ ఒకవైపు బాధాకరమైన సివిల్ సప్లైస్ శాఖకు వెళ్లడం గర్వంగా ఉందన్నారు. బదిలీపై వెళుతున్న రోహిత్ సింగ్ మాట్లాడుతూ చైతన్య వంతమైన జనగామ జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరి సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరామ్, జిల్లా అధికారులు, టీజీవో, టీఎన్జీవో అధ్యక్షులు, సెక్రెటరీ లు, రైస్ మిల్లర్స్, ప్రభుత్వ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## రెవిన్యూ డివిజన్ కోసం ధర్నా

**చేర్యాల, మన చౌరాస్తా :** దుద్దెడ క్రాస్ రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం రోజున రెవెన్యూ డివిజన్ సాధన కోసం అఖిలపక్ష పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో నాలుగు మండలాల అఖిలపక్ష పార్టీ నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. జేఏసీ చైర్మన్ వాకులాభరణం నర్సాయ పంతులు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, బి ఆర్ఎస్ నాయకులు బాల్ నరసయ్య, బిజెపి రాష్ట్ర నాయకులు బూర్గు సురేష్‌గౌడ్ లు మాట్లాడుతూ ఇప్పటికైనా చేర్యాలను రెవిన్యూ డివిజన్ ప్రకటించాలని లేకపోతే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్కు తగిన బుద్ధి చెప్తామని అన్నారు. జనగామ ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేర్యాలను రెవిన్యూ డివిజన్ గా ప్రకటిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక రెండు సంవత్సరాలు పూర్తి అయిన రెవిన్యూ డివిజన్ ప్రకటించకపోవడం ఇలాంటి హామీలను తుంగలో తొక్కడం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమన్నారు. జేఏసీ భాగస్వామ్య పక్షాలైన టిఆర్ఎస్, సిపిఎం, బిజెపి, తెలంగాణ టిడిపి, తెలంగాణ ఎమ్మార్పీఎస్ లు రెవిన్యూ డివిజన్ సాధన కొరకు భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేసి రెవిన్యూ డివిజన్ సాధించేంత వరకు కృషి చేయాలని అన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రజలందరూ తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో మద్దూర్, కొమరవెల్లి, చేర్యాల, ధూళిమిట్ట మండలాల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ స్వామి సన్మానం



**చేర్యాల, మన చౌరాస్తా :** చెరువులో దూకి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన ఓ మహిళ ప్రాణాలను కాపాడిన చేర్యాల పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తాండ్ర స్వామిని సోమవారం సీపీఐ నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ మాట్లాడుతూ.. చేర్యాల పట్టణానికి చెందిన ఓ వివాహిత మహిళ కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఈనెల 19న చేర్యాల పెద్ద చెరువులోకి దూకి ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించి ప్రాణాపాయ స్థితిలో చెరువులో మునిగిపోతుండగా అటువైపు వాకింగ్ చేస్తూ వెళ్తున్న కానిస్టేబుల్ స్వామి వెంటనే చెరువులోకి ఈత కొట్టుకుంటూ వెళ్లి ఆ మహిళను ఒడ్డున చేర్పించి నిండు ప్రాణాన్ని కాపాడడం గొప్ప విషయమని అన్నారు. వారికి సిద్దిపేట సీపీ అనురాధ చేతుల మీదుగా ప్రశంస పత్రంతో పాటు నగదు రివార్డు ప్రకటించడం అభినందనీయమని వారి సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల ఎస్సై వేముల నవీన్, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య, మండల కోశాధికారి నంగి కనకయ్య, మండల కార్యవర్గ సభ్యులు గూడెపు సుదర్శన్, పొన్నబోయిన మమత, సుంకోజు రజిత, కర్రె నర్సిరెడ్డి, గూడెపు పెంటయ్య, శ్రీరాం మహేష్, కాంగ్రెస్ పట్టణ నాయకుడు బండి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

# మెడికల్ షాపుల్లో ఆకస్మిక తనిఖీ



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్‌లో పలు మెడికల్ షాప్ లను డ్రగ్స్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. మెడికల్ షాప్స్ డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ 1940 ప్రకారం సదురు మెడికల్ షాపులు నిబంధనలు పాటిస్తున్నాయా లేదా అని తనిఖీలు చేశారు. దాదాపు 6 మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో ఎంటిపి కిట్లు (అబార్టీ ఫేషియెంట్ టాబ్లెట్లు) అనధికార విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా వైద్యుల డిస్క్రిప్షన్ లేకుండా అమ్మకం, హెచ్, హెచ్ 1 షెడ్యూల్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకపోవడం, ఈ ఉల్లంఘనలపై సంబంధిత మెడికల్ షాప్ లపై కేసులు నమోదు చేశారు. ఎంటిపీ కిట్ల విక్రయంలో డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ చట్టం 1940, 1945 ను ఉల్లంఘించే ఫార్మసీలపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



**గజ్వేల్, మన చౌరాస్తా :** గజ్వేల్ పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు పట్టుకున్నారు. రోడ్డుపై కంటైనర్ వాహనంలో పశువులను తరలిస్తున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు కంటైనర్లను తనిఖీ చేయగా వందకు పైగా పశువులు ఉన్నట్లు గుర్తించారు. వాటిని బలవంతంగా ఎక్కించడంతో దాదాపు పది పశువుల మృతి చెందినట్లు నిర్ధారించారు. పట్టుకున్న పశువులను పోలీసులు గోశాలకు తరలించి, పశువులను అక్రమ రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మన చౌరాస్తా
The Complete News way
26.08.2025 మంగళవారం
Mana Chourasta







# పండుగలా పనుల జాతర

- రఘునాథపల్లిలో రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు
- శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :**

'నాకున్న జెండా, ఎజెండా నియోజకవర్గ అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం మాత్రమే..' అని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. రఘునాథపల్లి మండలం గబ్బేటలో రూ.20 లక్షల ఎస్సీపీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన అలాగే రూ.20 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కంచనపల్లిలో రూ.25 లక్షల ఎస్సీపి నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.20 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో రూ.50 లక్షల ఎస్సీపి నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రఘునాథపల్లిలో రూ.20 లక్షల ఎస్సీపి నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కుర్చపల్లి గ్రామంలో రూ.40 లక్షల ఎస్సీపి నిధులతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, రూ.20 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రఘునాథపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో కడియం మాట్లాడుతూ ఒక్క రఘునాథపల్లి మండలానికే ఎస్సీపి నిధుల ద్వారా ఎస్సి కాలనీలలో సిసి రోడ్ల నిర్మాణానికి రూ.4 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు.

ఈజీఎస్ కింద రూ.2 కోట్లు మంజూరు అయ్యాయని పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అలాగే నియోజకవర్గంలోనే ఎక్కువగా రఘునాథపల్లి మండలానికి 561 ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్టు తెలిపారు. రఘునాథపల్లి మండల కేంద్రంలో అన్ని పనులకు కలిపి త్వరలోనే కోటి రూపాయలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఎంపీ నిధుల నుండి మహిళా కమ్యూనిటీ హాల్ భవనాన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. రఘునాథపల్లి మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసుకుందామని, కానీ అన్ని పనులు ఒకేసారి చేయాలేమని, దశల వారీగా పనులన్నింటిని పూర్తి చేసుకుందామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఆర్డివో డి.ఎస్ వెంకన్న, డీఆర్‌డీఏ పీడీ, తహసీల్దార్, ఎంపీడీవో, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుకు మరమ్మతులు చేయాలి

**సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి**

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** సంవత్సరాలుగా గుంతలమయమై ప్రమాదాలకు కారణమవుతున్న బచ్చన్నపేట - జనగామ నేషనల్ హైవేను వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. కొడవటూర్ కమాన్ నుంచి జనగామ రోడ్డులోని పోలీస్ స్టేషన్ వరకు వందలాది మంది పాల్గొన్న ఈ పాదయాత్రను సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బచ్చన్నపేట కేంద్రంలోని ఈ రహదారి యాదాద్రి భువనగిరి, సిద్దిపేట, జనగామ జిల్లాలను కలుపుతున్న ముఖ్య రహదారి. అయినా అధికారులు దీన్ని పట్టించుకోవడం లేదు. రద్దీగా ఉండే ఈ రహదారిపై భారీ వాహనాలు తరచూ బోల్తా పడుతున్నాయి. అనేక




మంది ప్రాణాలు కోల్పోయారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్ల విస్తరణ కోసం కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామంటూ కాగితాలకే పరిమితం అవుతున్నాయి. దీని ప్రత్యక్ష నిదర్శనమే ఈ అధ్వానమైన బచ్చన్నపేట నేషనల్ హైవే..' అన్నారు. వర్షాకాలం కారణంగా గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు మరింత పెరిగాయని ఆయన పేర్కొన్నారు. 'ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలంటే వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలి. వారం రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే కలెక్టర్ ఆఫీస్‌ను ముట్టడిస్తాం. రోడ్లను దిగ్బంధిస్తాం..' అని హెచ్చరించారు. పాదయాత్ర అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి, తహసీల్దార్ రామానుజ చారికి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, సభ్యులు రావుల రవీందర్ రెడ్డి, బైరగోని మిన్నలాపురం ఎల్లయ్య, బలరాం అన్న, బోయిన రాజు, పర్వతం నర్సింలు, తాడెం రాములు, గోలకొండ ఈదమ్మ, మన్నె లక్ష్మి, కల్పన, ఇంజ. ఎల్లయ్య, సీనియర్ నాయకులు ఎడబోయిన రవీందర్ రెడ్డి, బోయిన శ్రీనివాస్, రామగళ్ల అశోక్, బోదాస్ సుధాకర్, కంత్రి ఐలయ్య, శాఖ కార్యదర్శులు బుర్రి సుధాకర్, బడంగల బలరాములు, బాలరాజు, సమ్మయ్య, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బోదాస్ మురళి తదితరులు పాల్గొన్నారు.



# పీసీసీ అధ్యక్షుడి దిష్టి బొమ్మ దహనం

భీమదేవరపల్లి, మన చౌరాస్తా : భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దిష్టి బొమ్మను స్థానిక బీజేపీ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమాన్ని మండల శాఖ అధ్యక్షుడు శ్రీరామోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 'మహేష్ కుమార్ గౌడ్ నిరాధారంగా మాట్లాడుతున్నారు. అలాంటి వ్యాఖ్యలు వెంటనే ఆపాలని మేము డిమాండ్ చేస్తున్నాం. కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో గెలిచే శక్తి ఉంటే చూపించాలి. నామినేట్ పదవులు వచ్చినంత మాత్రాన ఎంపీ గెలవగలరని అనుకోవడం సరికాదు' అని విమర్శించారు. తదనంతరం జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్ మాట్లాడుతూ 'తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 63 ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు గెలిచినప్పుడు కూడా దొంగ ఓట్లతో గెలిచారని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉంది. బీజేపీని అపఖ్యాతి పాలుచేయడం మానుకోవాలి. కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభివృద్ధి కార్యక్రమాలతో ఎల్లప్పుడూ ప్రజలతో ఉంటారు. ఎంపీ పదవి నామినేట్ పదవి కాదని గుర్తుంచుకోవాలి. బండి సంజయ్ జోలికి వస్తే కరీంనగర్ ప్రజలు కాంగ్రెస్ నాయకులను గట్టిగా నిలదీస్తారు' అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ పైడిపెల్లి పృథ్వీరాజ్ గౌడ్, సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, దుర్గసింగ్, అయిత సాయి, దొంగల రాణా, ములుగు సంపత్, కంకల సదానందం, సింగం రాజేందర్, కొక్కిస వైకుంఠం, సోప్పరి నవీన్, జక్కనపెల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా అందించడంలో విఫలం

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** తెలంగాణలో రైతులకు యూరియా బస్తాలు అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పూర్తిగా విఫలమైందని, వారి నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏర్పుల మహేష్ అన్నారు. యూరియా కోసం రైతులు ఫర్టిలైజర్స్ దుకాణాలు, రైతు వేదిక వద్ద నిరీక్షణ చేసిన కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వేదికల వద్ద పోలీసు పహారాలో యూరియా అందించడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణకు రావాల్సిన వాటా ప్రకారం 4.48 లక్షల టన్నుల యూరియాను అందజేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో గజ్జె వెంకటేష్, బొచ్చు కిషన్, మ్యాకల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.









# రైతులకు యూరియా కొరత తీర్చాలి



**చేర్యాల, మన చౌరాస్తా :** తెలంగాణలో రైతులకు యూరియా బస్తాలు అందించడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో చేర్యాల రైతు వేదిక వద్ద రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. అనంతరం చేర్యాల తహసీల్దార్ దిలీప్ నాయక్, చేర్యాల మండల వ్యవసాయ అధికారి పులి భోగేశ్వర్ లకు వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ మద్దతు తెలిపి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నుండి బీజేపీకి 8 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రైతులకు ఎరువుల కొరతను తీర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు కత్తుల భాస్కర్ రెడ్డి, బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు ఈరి భూమయ్య లు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎరువులు యూరియా బస్తాల కోట తగ్గించి తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన 4.48 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు లక్షల్లో పెట్టుబడులు పెట్టి పండించిన పంటలకు ఎరువులు, యూరియా కోసం రోజుల తరబడి వేచి చూస్తున్నా రైతుల బాధలు కేంద్ర ప్రభుత్వం అర్థం కావడం లేదని వారు విమర్శించారు. రైతే రాజు అని చెప్పి ప్రభుత్వాలు ఆచరణలో పెట్టడంలో పూర్తిగా కేంద్ర ప్రభుత్వం విఫలం అయ్యింది అన్నారు. రైతులను మభ్యపెట్టి గద్దెనెక్కిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు గాడి తప్పిందన్నారు. సమయానికి పంట పొలాలకు ఎరువులు, యూరియా వెయ్యకపోతే రైతులకు తీవ్ర నష్టాలు వస్తాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతంగానికి ఎరువులు, యూరియా, విత్తనాలు పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలను నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి, నంగి కనకయ్య, పొన్నబోయిన శ్రీనివాస్, గుడెపు సుదర్శన్,బీర్ల శ్రీనివాస్, అమరగొండ నరసింహులు, కిషన్, రాజయ్య, మల్లేశం, కనకయ్య రమేష్, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# వెంకటరాజయ్య మృతి తీరని లోటు



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లాకు చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ తాటికొండ వెంకటరాజయ్య అకస్మిక మరణం సాహిత్య, సామాజిక, రాజకీయరంగాలకు తీరని లోటని జనగామ జిల్లా కవులు కళాకారుల ఐక్యవేదిక పేర్కొంది. సోమవారం జనగామలో ప్రొఫెసర్ డాక్టర్ తాటికొండ వెంకటరాజయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వెంకట రాజయ్య జనగామ నియోజకవర్గం తరిగొప్పుల మండలం అంకుషాపురం గ్రామానికి చెందిన వారు, వీరు ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ పని చేశారు. అంతర్జాతీయ యోగా గురువు, సాధకులు, తెలంగాణ రాందేవ్ బాబాగా పిలుస్తారు. మంచి ఉపన్యాసకులు, సుమారు 50 పుస్తకాలు రాసిన గొప్ప రచయిత. తెలంగాణలో అనేక వేదికల పైన ప్రసంగాలు చేసి ఆకట్టుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి. వరంగల్, ఖమ్మం, నల్గొండ స్కూటో టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేశారు. మాతా అరవింద ప్రియ శిష్యులు, ఉద్యోగ విరమణ అనంతరం న్యాయవాద పట్టా పొంది హైకోర్టు న్యాయవాదిగా కొనసాగుతున్నారు. సాహిత్య, రాజకీయ, సామాజిక రంగాల్లో విశ్లేషకులుగా చక్కని వాగ్దాటి వెంకట రాజయ్య స్వంతం. బీసీలకు రాజ్యాధికారం సాధించాలనే బలమైన సంకల్పంతో కలిగిన ఉన్న వ్యక్తుల్లో ఒకరు. వీరి సంపాదకత్వంలో జిల్లా కవుల సాహిత్యంతో "జనగామ తపన" అనే కవితా సంకలనం ముద్రించారు. త్వరలో ఆవిష్కరణ చేయాల్సి ఉండగా ఇంతలోనే ఈ దారుణం చోటుచేసుకుంది. వీరి మృతికి సంతాపం ప్రకటించి నివాళులు అర్పించినవారిలో కవులు, కళాకారులు, కళా, సాహితి సంస్థల ప్రతినిధులు జి.కృష్ణ, అయిలా సోమనర్సింహచారి, పెట్లోజు సోమేశ్వరాచారి, లగిశెట్టి ప్రభాకర్, రెడ్డి రత్నాకర్ రెడ్డి, గంగరాజు శ్రీనివాస్ రావు, పొట్టబత్తిని భాస్కర్, చిలుమోజు సాయికిరణ్, గడ్డం మనోజ్ కుమార్ గౌడ్, డాక్టర్ వేముల సదానందం, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్, రంగరాజు ప్రసాద్, రాపోలు సత్యనారాయణ, మాన్యపు భుజేందర్, అంకాల సోమయ్య, మామిండ్ల రమేష్ రాజా, మసురం రాజేంద్ర ప్రసాద్, గుండె కనకయ్య, కె.జగదీశ్వరి, కొట్టె శ్రీలత, త్రిపురారి పద్మ, బుదారపు లావణ్య, దిగోజు శ్రీలక్ష్మి ఉన్నారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

## ఏబీవీపీ నాయకుల డిమాండ్

హుస్నాబాద్, మన చౌరాస్తా : ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి భీమగోని చరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలలు పెండింగ్ ఫీజుల కోసం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని, కొన్ని కళాశాలలు బలవంతంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆయన ఆరోపించారు. పరీక్షలను బహిష్కరిస్తున్న స్థితి ఏర్పడిందని, అయినా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి స్పందన చూపకపోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థుల వ్యతిరేకత ఎదుర్కొని గద్దె దిగి వెళ్లాల్సి వచ్చిందని గుర్తుచేసిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వం కూడా విద్యార్థుల సమస్యలపై సీరియస్‌గా స్పందించాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 13 లక్షల మంది బడుగు బలహీన వర్గాల విద్యార్థులు సర్టిఫికెట్లు తీసుకోవడానికి కళాశాలల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని, లేకపోతే ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు రాహుల్, సంయుక్త కార్యదర్శులు అంజి, రాజేష్, రామ్ చరణ్ పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**గజ్వేల్, మన చౌరస్తా :** ప్రభుత్వం పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవులపల్లి మహేందర్ డిమాండ్ చేశారు. గజ్వేల్ లో విలేకరులతో మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల కోసం వేధిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని లేకపోతే జిల్లాల వారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.